సమాచారం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : మదీనాగూడ, చందానగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో ఉదయం 09.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు మదీనాగూడ విలేజ్, ప్రణామ్ హాస్పటల్ ఏరియా, మల్లన్న టెంపుల్ ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.
- మదీనాగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.00 గం నుంచి సా 5.30 గంటల వరకు ల్యాండ్ మార్క్ రెసిడెన్సీ, ఆర్టీసీ కాలనీ, జెనిసిస్ స్కూల్, తులసిరాం చాంబర్స్, నైమిషా అపార్ట్‌మెంట్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ రాజేందర్ తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్ : నల్లగండ్ల హుడా, అపర్ణ ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ సురేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుండి మ ధ్యాహ్నం 1 గంట వరకు నల్లగండ్ల హుడా పరిధిలోని హుడా వాటర్ ట్యాంక్ ఏరియా, రత్నదీప్ బ్యాక్‌సైడ్ ఏరియా, రిలయన్స్ బ్యాక్‌సైడ్ ఏరియా, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అపర్ణ ఫీడర్ పరిధిలోని అపర్ణ సైబర్ కమ్యూనిటీ, ప్రణం ఆసుపత్రి ఏరియా ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వినాయక్‌నగర్, లక్ష్మీ ఎన్‌క్లేవ్, గ్రీన్ ల్యాండ్ కాలనీ, జీపీఆర్ఏ క్వార్టర్స్, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నానక్‌రాంగూడ విలేజ్, సుమధుర అపార్ట్‌మెంట్, ది శ్రీరామ స్కూల్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వినాయక్‌నగర్ మెయిన్‌రోడ్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు 'మనూ'లో స్టూడెంట్స్ యూనియన్ ఎన్నికలు

రాయదుర్గం: మనూలో విద్యార్థి సంఘం ఎన్నికల (ఎంఎస్‌యూ) 2022–23 నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని క్యాంపస్‌లలో ఒకేసారి పోలింగ్ నిర్వహించనున్నారు. యూనివర్సిటీ ప్రధాన క్యాంపస్‌లో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, ట్రెజరర్, ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రతినిధులను ఎన్నుకుంటారు. ఈ ఎన్నికలలో యూనివర్సిటీలోని మొత్తం 3,257 మంది విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 29 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

ఫిబ్రవరి 10న జాతీయస్థాయి సెమినార్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఫిబ్రవరి 10వ తేదీన 'నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్ వర్క్: క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ పాలసీ'పై ఒక రోజు జాతీయ సెమినార్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్, హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ సెంటర్ హెచ్‌సీయూ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సెమినార్‌ను నిర్వహిస్తున్నారు. ఈ సెమినార్‌లో పలువురు వైస్‌చాన్స్‌లర్లు, స్టడీస్ డీన్లు, వివిధ శాఖల బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్లు, విభాగాల అధిపతులు, సీనియర్ ఫ్యాకల్టీలు పాల్గొంటారు.

క్లుప్తంగా...

సెల్ఫీ అంటే ఎంతో ఇష్టం


రెడ్ మీ నోట్ 12 జి ఫోన్‌ను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న నటి నిహారిక

గచ్చిబౌలి: సెల్ఫీలు దిగడం ఎంతో ఇష్టమని నటి కొణిదెల నిహారిక అన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని సెల్‌బే మొబైల్ షోరూమ్‌లో రెడ్ మీ నోట్12 జి స్మార్ట్ ఫోన్‌ను ఆమె మార్కెట్‌లోకి విడుదల చేశారు. తొలి కస్టమర్‌కు మొబైల్ ఫోన్ అందించారు. కార్యక్రమంలో సెల్‌బే ఎండీ సోమ నాగరాజు, డైరెక్టర్ సుహాస్ నల్లచెరు పాల్గొన్నారు.


హఫీజ్‌పేట్ అంబేడ్కర్ కాలనీ వద్ద ఉన్న ఎస్సీ శ్మశానవాటిక ఇదే


శ్మశానవాటిక ముందు అసంపూర్తిగా ఉన్న కమాన్

చివరి కష్టాలెన్నో...

- అంబేడ్కర్‌నగర్ శ్మశానవాటికలో వసతులు కరువు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

హఫీజ్‌పేట్: జీహెచ్‌ఎంసీ పరిధిలోని అంబేడ్కర్‌నగర్ శ్మశానవాటికలో కనీస వసతులు కరువయ్యాయి. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు శ్మశానవాటికలలో కనీస వసతులు కల్పించారు. కానీ హఫీజ్‌పేట్‌లోని అంబేడ్కర్ కాలనీని ఆనుకొని ఉన్న శ్మశానవాటిక అభివృద్ధిపై మాత్రం దృష్టి సారించడం లేదని స్థానికులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం శ్మశానవాటికలను మహాప్రస్థానాలుగా మారుస్తున్న క్రమంలో కనీస వసతులు కల్పించాలంటూ అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు అందించినా ఫలితం లేదంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక నిధులు కేటాయించి ఎస్సీ శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని, శ్మశానవాటిక చుట్టు ప్రహరీ, స్నానపు గదులు, దహన సంస్కారాలకు ప్రత్యేకంగా దిమ్మెలు నిర్మించి లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సమస్యలు ఇవే..

- 2012 సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ రూ.20 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నాటి నుంచి ఇప్పటి వరకు పట్టించుకునే వారు లేరు.
- శ్మశానవాటిక విస్తీర్ణం మూడు ఎకరాలు అని, అది ఇప్పుడు 1.20 ఎకరాలు ఉంది.
- పిచ్చిమొక్కలు పెరిగిపోయి పాములు తిరుగుతుండడంతో ప్రజలు భయపడుతున్నారు
- చెత్త చెదారం, మట్టి కుప్పల మధ్యలో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి.
- అసంపూర్తిగా నిర్మించి శ్మశానవాటిక కమాన్‌తో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

పనులు వెంటనే ప్రారంభించాలి



హఫీజ్‌పేట్ ఎస్సీ శ్మశానవాటిక అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలి. కనీస వసతులు లేక స్థానిక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు వచ్చి శ్మశానవాటిక పక్కన తమ స్థలం ఉందంటూ సర్వేలు చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

– రాజు, అంబేడ్కర్ కాలనీ

ప్రత్యేక నిధులు కేటాయించాలి



ఎస్సీ శ్మశానవాటిక అభివృద్ధి కోసం వెంటనే ప్రత్యేక నిధులు కేటాయించాలి. దహన సంస్కారాలకు కావలసిన కనీస వసతులు ఏర్పాటు చేయాలి. శ్మశానవాటిక చుట్టు ప్రహరీ నిర్మించాలి. చెత్త చెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలి.

– ధన్‌రాజ్, అంబేడ్కర్ కాలనీ

దశలవారీగా వసతుల కల్పన

గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి వెల్లడి


గోపన్‌పల్లితండాలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రతి బస్తీ, కాలనీలను అభివృద్ధి చేస్తామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లి తండాలో రూ.1.20 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతికాలనీ, బస్తీలో పూర్తిస్థాయి మౌలిక వసతులను దశలవారీగా కల్పించేందుకు తగిన ప్రణాళికతో ముందుకుసాగుతున్నామన్నారు. అంతర్గతరోడ్లను సీసీరోడ్లుగా, ప్రధాన రోడ్లను బీటీరోడ్లుగా మారుస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు హన్మంతునాయక్, శేఖర్, నర్సింగ్‌నాయక్, నందునాయక్, బాబు, మోహన్, గోపన్‌పల్లి తండావాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం సీఎం సహాయనిధి



లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

అల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురికి వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.12 లక్షల 8 వేల 500 రూపాయల మొత్తాన్ని లబ్ధిదారులకు బుధవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నే శ్రీనివాసరావులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిరంతర సేవలను అందిస్తూ ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్నదన్నారు. కార్యక్రమంలో వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు రాజు యాదవ్, మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాయకులు సాంబశివరావు, జంగంగౌడ్, కాశీనాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు


దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు

అల్విన్‌కాలనీ: చిన్నారులకు సంక్రాంతి పండగ విశిష్టతను తెలిపే విధంగా అల్విన్‌కాలనీ మొదటి ఫేజులోని రూస్ కిడ్స్ స్కూలులో బుధవారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు .పల్లెటూరు వాతావరణం ప్రతిబింబించేలా స్కూలును ముస్తాబు చేశారు. చిన్నారులకు సంక్రాంతి పండుగ గురించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా చిన్నారులు హరిదాసు ,దశావతారం, శ్రీకృష్ణుడు, ఆంజనేయుడు, పరశురాముడు, గోదాదేవి, వెంకటేశ్వర స్వామి వంటి వేషధారణల్లో చిన్నారులు ఆకట్టుకున్నారు.

సొంతూళ్లకు వెళితే సమాచారం ఇవ్వండి

డీఎస్పీ భీంరెడ్డి

పటాన్‌చెరు టౌన్: సొంతూళ్లకు వెళితే సమాచారం ఇచ్చి వెళ్లాలని పటాన్‌చెరు డీఎస్పీ భీంరెడ్డి అన్నారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ...పటాన్‌చెరు సబ్ డివిజన్ పరిధిలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్, భానూర్, బీడీఎల్, జిన్నారం, బొల్లారం, గుమ్మడిదల, హత్నూర పరిధిలో ఎవరైనా ఊళ్లకు వెళ్తే ఆయా పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో సమాచారం ఇవ్వాలన్నారు. ఊరికి వెళ్లేవారు డోర్ సెంట్రల్ లాక్ సిస్టమ్, సెక్యూరిటీ అలారం, సెన్సార్ అమర్చుకుంటే మంచిదన్నారు. నగదు, ఆభరణాలను బ్యాంక్ లాకర్లలోగానీ, తెలిసిన వారి వద్ద గానీ భద్రపరచాలన్నారు. కాలనీ, బస్తీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్లో లేదా డయల్ 100కు ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు.

పతంగుల ఆవిష్కరణ

రాయదుర్గం: హైదరాబాద్ నగరం ఒక మినీ ఇండియాగా గుర్తింపు పొందిందని శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే ఎం భిక్షపతియాదవ్ అన్నారు. వివేకానందనగర్ డివిజన్ గోపాల్‌రావు ఆధ్వర్యంలో తయారు చేసిన పతంగులను ఆయన గోపన్‌పల్లిలో బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు రాజిరెడ్డి, బాలుయాదవ్, మల్లికార్జున్‌గౌడ్, వెంకటేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న జయంతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లో వడ్డే సంఘం అధ్యక్షుడు రాకేష్ బుధవారం ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న జయంతిలో మున్సిపల్ చైర్ పర్సన్ మల్లేపల్లి లలితా సోమిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల కోసం బ్రిటిష్ వారితో పోరాడిన ఘనత వడ్డే ఓబన్నదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీశైలం యాదవ్, నాగరాజు, శంషాబాద్ రాజు, వడ్డే సంఘం నాయకులు వడ్డే నరసింహ, విఠల్, రాజు, యాదగిరి, మాజీ ఉపసర్పంచ్ కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, సునీల్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పటాన్‌చెరుటౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు మృతిచెందాడు. ఎస్ఐ దుర్గయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ జాతీయ రహదారిపై డిసెంబర్ 29వ తేదీన ఇస్నాపూర్ గ్రామస్తుడు శ్రీకాంత్ రోడ్డుదాటుతున్నాడు. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు పటాన్ చెరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గోదాంలో అగ్నిప్రమాదం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో టీఎస్ఐఐసీకి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు చెత్తను తగలబెట్టాడు. సమీప బహిరంగ గోదాంలో ఉంచిన రియాక్టర్లకు మంటలు వ్యాపించాయి. దీంతో పటాన్‌చెరు అగ్నిమాపక కేంద్రం, పాశమైలారం పారిశ్రామిక వాడ నుంచి ఫైరింజన్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. పెట్రోల్ బంక్ పక్కనే ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సంఘటనా స్థలాన్ని ఫైర్ స్టేషన్ ఆఫీసర్ జన్యానాయక్, పటాన్‌చెరు డీఎస్పీ భీంరెడ్డి, పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డి సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రైతుల కోసం విద్యార్థుల విరాళాల సేకరణ

గవర్నర్ తమిళిసైకి రూ.1,00,116 చెక్కు అందజేత


గవర్నర్ తమిళి సైకి చెక్కును అందజేస్తున్న విద్యాసంస్థల డైరెక్టర్ వీరేంద్ర చౌదరి, విద్యార్థులు

హఫీజ్‌పేట్ : జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని రైతుల సహాయార్థం ప్రధానమంత్రి సహాయనిధికి త్రివేణి ఎడ్యుకేషనల్ విద్యార్థులు రూ.1,00,116ల విరాళాన్ని బుధవారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసైకి అందజేశారు. ఈ సందర్భంగా త్రివేణి డైరెక్టర్ డాక్టర్ వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ రైతు చేతులు భూమిలోకి వెళ్తినే, మన వేళ్ళు నోటిలోకి వెళతాయని, రైతును కాపాడుకోవాలన్నారు. అనంతరం వీరేంద్ర చౌదరిని గవర్నర్ తమిళిసై సత్కరించారు. విద్యార్థులకు పుస్తకాలు బహుకరించారు.

ఫిష్ స్పెషల్



రాయదుర్గం: చేపల వంటకాలు నోరూరించాయి. గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథమ్)లో మూడు రోజులుగా నిర్వహించిన శిక్షణ బుధవారంతో ముగిసింది. తెలంగాణ స్టేట్ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్(టీఎస్ఎఫ్‌సీఓఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న 40 మంది మహిళలు చేపలతో రకరకాల వంటలు చేసి అందరిచేత 'శభాష్' అనిపించుకున్నారు. ముగింపు కార్యక్రమంలో నిథమ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ చిన్నంరెడ్డి మాట్లాడుతూ మత్స్యకార మహిళా సహకార సంఘాలు, మహిళా పారిశ్రామికవేత్తల సమూహంలోని సభ్యులు 40 మందికి మూడు రోజులపాటు శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫిషరీస్ శాఖ జీఎం వి. శ్రీనివాస్, జిల్లా అధికారి ఎం చరిత, శిక్షణ సమన్వయ కర్త మిచెల్‌జే ఫ్రాన్సిస్, నిథమ్ చెఫ్ రవి, నిథమ్ అధికారులు, పాల్గొన్నారు.

శిక్షణ పొంది.. వంటలు చేసి


శిక్షణ పూర్తి చేసుకున్న వారితో నిథమ్ డైరెక్టర్ డా.చిన్నంరెడ్డి, అధికారులు శ్రీనివాస్, చరిత

పండగ వేళ.. జాగ్రత్తలు తప్పనిసరి

దొంగతనాల నివారణపై ఆటో ద్వారా పోలీసుల ప్రచారం


ప్రచార ఆటోను సిద్ధం చేసిన గచ్చిబౌలి పోలీసులు

గచ్చిబౌలి: సంక్రాంతికి ఊరు వెళితే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గచ్చిబౌలి సీఐ గోనె సురేష్ పేర్కొన్నారు. బుధవారం పీఎస్ పరిధిలో దొంగతనాల నివారణపై అవగాహన కల్పించేందుకు ఆటో ద్వారా ప్రచారాన్ని ప్రారంభించారు. దొంగతనాల నివారణ సూచనలతో కూడిన ఫ్లెక్సీలు, లౌడ్ స్పీకర్ ద్వారా అప్రమత్తం చేస్తామని ఆయన తెలిపారు. విలువైన నగలు ఇంట్లో పెట్టరాదని , సెంట్రల్ లాకింగ్ వేసుకోవాలని పోలీసులు సూచించారు. ఊరెళితే పీఎస్‌కు సమాచారం అందించాలని, నమ్మకమైన వాచ్‌మెన్‌లను పెట్టు కోవాలని, తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. తాళం వేసినట్లు కనిపించకుండా కర్టెన్ వేయాలన్నారు. కాలనీలు, బస్తీలలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు కాల్ చేయాలన్నారు. నిరంతరం పెట్రోలింగ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఐ రవీందర్, ఎస్ఐలు శోభన్ బాబు, సుబ్రహ్మణ్యం, సురేందర్‌రెడ్డి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ది ప్లాంట్ జర్నల్‌లో హెచ్‌సీయూ పరిశోధనా పత్రం


ప్లాంట్ సైన్స్ పరిశోధక బృందం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్లాంట్ సైన్సెస్ ప్రొఫెసర్ రాజగోపాల్ ఆధ్వర్యంలో పరిశోధకుల బృందం రూపొందించిన పరిశోధనా పత్రం ఇటీవల ప్లాంట్ సైన్సెస్ జర్నల్ 'ది ప్లాంట్ జర్నల్'లో ప్రచురితం కావడం విశేషం. ప్రొఫెసర్ ఎస్ రాజగోపాల్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ ఏఎస్ రాఘవేంద్ర, పరిశోధక బృందంలో జయేంద్రపాండే, ఎల్సిన్‌రాజు, దేవదాసు, దీపక్‌సైని, కునాల్‌దోక్నే, సురేష్‌బాబు మర్రిబోయిన ఉన్నారు. 'కరువు ఒత్తిడిలో బఠానీ(పిసమ్ సాటివమ్) ఆకుల కిరణజన్య సంయోగక్రియ ఉపకరణం యొక్క నిర్మాణం, పనితీరులో రివర్సిబుల్ మార్పులు' అనే అంశంపై పరిశోధన చేశారు.

గీతంలో ఆకట్టుకున్న 'సంస్కృతి'


గెలుపొందిన విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న అతిథి

పటాన్‌చెరు టౌన్: అంతరించిపోతున్న భారతీయ కళలను కాపాడేందుకు గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విద్యార్థులు 'సంస్కృతి' కార్యక్రమంను బుధవారం నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు కళలు, కవిత్వాన్ని ప్రదర్శించేందుకు పోటీపడ్డారు. విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. షార్ట్ ఫిలిమ్ పోటీలకు విద్యార్థుల నుంచి మంచి ఆదరణ లభించింది. ఈ సందర్భంగా హిట్వర్స్ సృష్టికర్త డాక్టర్ శైలేశ్ కొలను, టాలీవుడ్ నటి శ్రీవిద్యా మహర్షి, పాత్రికేయురాలు ప్రేమమాలిని, గాయని లాలసలను సత్కరించారు. చేనేత కళాకారులకు మద్దతుగా విద్యార్థులు చేనేత దుస్తులు ధరించి ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌లు, పోలీస్ అధికారులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని తులసినగర్‌లో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ సీడీపీ ఫండ్స్, కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 3.70లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, మాధవరం రోజాదేవి, సిఐ సైదులు, ఎస్ఐ శ్రీకాంత్‌లతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ తులసినగర్‌కాలనీ వాసులు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అదనపు కెమెరాలు ఏర్పాటుకు తన వంతు ఆర్థిక సహాయం అందజేస్తానన్నారు. కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బీఆర్‌యస్ పార్టీ నాయకులు కాశీనాద్ యదవ్, మోజెస్, తులసీనగర్ కాలనీవాసులు రామకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, సుకుమార్, ప్రశాంత్, నరేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



హఫీజ్‌పేట్ : సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఓల్డ్ హఫీజ్‌పేట్ గ్రామంలో బుధవారం కొమిరిశెట్టి ఫౌండేషన్, విజేత సూపర్ మార్కెట్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వరలక్ష్మి, ఆశా, రాఫత్, రాధ, ఈశ్వరమ్మ, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నిమ్మల సాయికుమార్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలో..

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ రైతుబజార్ వద్ద ఆల్విన్ కాలనీ డివిజన్ బీఆర్‌యస్ పార్టీ మహిళా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల కార్యక్రమానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్ గౌడ్, మాధవరం రోజాదేవిలు ముఖ్య అతిథులుగా హాజరై ముగ్గులను తిలకించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మన సాంప్రదాయాలను నేటి తరానికి తెలియజేయడం ఈ ముగ్గుల పోటీల ప్రత్యేకత అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటం ముగ్గు, బీఆర్‌యస్ పార్టీ, రైతు బంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మీ వంటి సంక్షేమ పథకాలను వివరిస్తూ వేసిన ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస యాదవ్, మాజీ డివిజన్ అధ్యక్షుడు జిల్లా గణేష్, ఉపాధ్యక్షుడు కాశీనాద్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై మురుగు

మియాపూర్ : రోడ్డుపై మురుగు ప్రవాహంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డులో మ్యాన్‌హోళ్ల నుండి మురుగునీరు పొంగి రోడ్డుపై పారుతోంది. నెల రోజులుగా మురుగుతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు వెళ్లే సమయంలో మురుగు నీరు మీద పడుతుందని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న హస్తకళా ప్రదర్శనలో భాగంగా సాయిగీత అమృత అర్త అకాడమీ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. మూషికవాహన, అదిగో అల్లదిగో, శివాష్టకం తదితర అంశాలను ప్రదర్శించారు.

–మాదాపూర్